క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్టలో ఆదిమూలపు



పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో డాక్టర్ సురేష్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం పాలేటిపాడులో ఆదివారం జరిగిన పోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్టలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసులు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు దగ్గుమాటి శ్రీనివాసులు, బత్తిన మనోహర్, సర్పంచ్ కె.పున్నారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరిరూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో సోమవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు టౌన్ ఫీడర్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, కూచిపుడిపల్లి, పామూరు బస్టాండ్ ఏరియా, చెప్పల్ బజార్, గార్లపేట రోడ్డు, ఇందిరా కాలనీ, శివనగర్ కాలనీ, ఎన్జీఓ కాలనీ, ఉంగరం బిల్డింగ్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

35 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణమోహన్

కొండపి: మండలంలోని కట్టావారిపాలెంలో మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 35 మందిని పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు తరుచూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామ పెద్దలు మానికొండ వెంకటేశ్వర్లు, వీరమోసు మస్తాన్ ఆరోగ్య భవనం దాత గుంటుపల్లి పద్మావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ చెన్నకేశవ స్వామి కొలుపులు



కొనతాళ్ల గ్రామోత్సవంలో కత్తి సేవలు చేస్తున్న భక్తులు

హనుమంతునిపాడు: హనుమంతునిపాడులో ఆదివారం లక్ష్మీ చెన్నకేశవస్వామి కొలుపులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కొనతాళ్ల వద్ద పూజలు చేశారు. అనంతరం పోతురాజులకు పట్టాలు కట్టారు. స్వామికి ప్రత్యేక పొంగళ్లు పొంగించి పోతురాజు శిల్పల వద్ద గుడి చుట్టూ ప్రదిక్షణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ బలోపేలానికి కృషి చేస్తా



స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆబిద్‌ఆలీ

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సయ్యద్ ఆబిద్‌ఆలీ ఆదివారం పార్టీ క్యాంపు కార్యాలయంలో పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, షేక్ మహమూద్‌బాషా, రాపూరి ప్రభావతి, సురేష్ పాల్గొన్నారు.

కొండపి తహసీల్దార్‌గా శ్రీనివాసరావు

కొండపి: మండల తహసీల్దార్‌గా సేలం శ్రీనివాసరావును నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం నుంచి కొండపి మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం కొండపిలో విధులు నిర్వహిస్తున్న అడహక్ తహసీల్దార్ పి.మురళి..జరుగుమల్లికి బదిలీ అయ్యారు.

కుక్కలు బాబోయ్..కుక్కలు



పొన్నలూరులో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు



లింగంగుంటలో మరణించిన గొర్రెపిల్లలు



పొన్నలూరులో కుక్క దాడిలో గాయపడిన దృశ్యం

- గ్రామాల్లో శునకాల స్వైరవిహారం
- మనుషులు, మూగజీవాలపై తరుచూ దాడి
- నెల రోజుల్లో 20 మందికిపైగా కుక్కకాటు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

పొన్నలూరు: మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. గ్రామాల్లో గుంపులు, గుంపులుగా సంచరిస్తూ మనుషులు, గొర్రెలు, మేకలు, పశువులపై దాడి చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో మండలంలోని పలు గ్రామాల్లో సుమారుగా 20 మందికి పైగా కుక్క కాటుకు గురయ్యారంటే వీటి దాడి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పొన్నలూరు, కె.అగ్రహారం, విప్పగుంట, బాలిరెడ్డిపాలెం, మాలపాడు, ముప్పాళ్ల, ఉప్పలదిన్నె, వెంకుపాలెం, చెన్నిపాడు, బోగనంపాడు, ముప్పాళ్ల గ్రామాల్లో ఇటీవల చాలా మంది కుక్కకాటుకు గురై పొన్నలూరు ప్రాథమిక కేంద్రంలో చికిత్స పొందినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఈ మధ్య కాలంలో నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన యువకుడు పనిమీద పొన్నలూరు వచ్చి తిరిగి వెళ్తుండగా బీసీ కాలనీ సమీపంలో గుంపుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా వెంబడించాయి. దీంతో వాటి నుంచి తప్పించుకునే సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యాడు. అలాగే విప్పగుంట, లింగంగుంట గ్రామాల్లో కుక్కల గుంపు గొర్రెలపై దాడి చేయడంతో రెండు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పొన్నలూరు గ్రామంలో గడ్డం ప్రసాద్ అనే రైతు బ్యారన్ దగ్గర పొగాకు పనులు చేస్తుండగా వెనుక మాటుగా వచ్చిన కుక్క దాడి చేయడంతో కాలుకు తీవ్ర గాయమైంది. ఇలా చాల గ్రామాల్లో మనుషులు, మూగజీవాలపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. దీంతో గ్రామాల్లో ప్రజలు భయందోళన చెందుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉండి ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తూ దాడిచేసి గాయపరుస్తున్నాయి. పొన్నలూరు బస్టాండ్ సెంటర్‌లో ఇలాంటి పరిస్థితి ఎక్కువగా ఉంది. పనులపై ద్విచక్ర వాహనాలపై మండల కేంద్రానికి వచ్చే వెళ్లే వారిని వెంబడిస్తూ దాడి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి ఉండటంతో పక్క గ్రామాల నుంచి పొన్నలూరు వచ్చే వారు కుక్క కాటుకు గురవుతామని భయందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తీవ్రంగా గాయపడ్డాను



గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. ఇటీవల పొన్నలూరులో ఆరుగురు పైగా కుక్క కాటుకు గురయ్యారు. బ్యారన్ దగ్గర పొగాకు పనులు చేస్తుండగా ఒక్కసారిగా నాపై దాడి చేయడంతో కాలుకి తీవ్ర గాయమైంది. స్థానికి పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకున్నాను. అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల బెడద లేకుండా చూడాలి.

– గడ్డం ప్రసాద్, పొన్నలూరు

గొర్రెలపై దాడి చేసి చంపేశాయి



గ్రామాల్లో ఇటీవల కుక్కల బెడద ఎక్కువగా ఉంది. మనుషులతో పాటు మూగజీవాలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల మా గ్రామంలో గొర్రెలపై దాడి చేయడంతో రెండు గొర్రెలు మరణించాయి. ప్రతి గ్రామంలో చాలా వరకు ఇలాంటి పరిస్థితే నెలకొంది. కుక్కల బెడద వలన చిన్నారులు, విద్యార్థులు కూడా ఆందోళన చెందుతున్నారు. పగలు కూడా గ్రామాల్లో తిరగలేక పోతున్నారు. పంచాయతీ అధికారులు గట్టి చర్యలు చేపట్టాలి.

– నల్లపు బ్రహ్మయ్య, బాలిరెడ్డిపాలెం

పలువురిని పరామర్శించిన నేతలు



చెరుకూరులో మహేష్‌ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొన్నలూరు:

మండలంలోని చెరుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కార్యవర్గ సభ్యుడు గొర్రెపాటి మహేష్ పాము కాటుకు గురయ్యాడు. అలాగే లింగంగుంట గ్రామానికి చెందిన వరికూటి ఆంజనేయులు అనారోగ్యంతో ఉండి విశ్రాంతి పొందుతున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి మన్నెం చిన్న వెంకటేశ్వర్లు ఆదివారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని, కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. వారి వెంట పార్టీ మండల ఉపాధ్యక్షుడు కాటా మల్లికార్జునరావు, కొల్లూరి సాయిరాం, సగిలి రామకృష్ణారెడ్డి ఉన్నారు.

ఉపేంద్ర చౌదరి మృతి తీరని లోటు



ఉపేంద్ర చౌదరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్, వెంకయ్య, ఇతర నేతలు

కొండపి: వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం ఉపేంద్ర చౌదరి మరణం పార్టీ తీరని లోటని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో శ్వాస పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతున్న ఉపేంద్ర చౌదరిని చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిమూలపు సురేష్ స్వగ్రామమైన కట్టవారిపాలెం చేరుకొని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఉపేంద్ర చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి, మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, ఇంటలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, రాష్ట్ర యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షుడు భువనగిరి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు రావులపల్లి కోటరాజు, వేముల ప్రసాద్, ఇతర విభాగాల నేతలు పాల్గొన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో ప్రతిభ

కనిగిరిరూరల్: ఏపీ ఎంసెట్ ఫలితాల్లో విజేత అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎస్‌కే నజ్మా 3,735వ ర్యాంక్, రవీంద్ర 7,758వ ర్యాంక్, మాలిని 8,849వ ర్యాంక్, సయ్యద్ ఆస్మీన్ 10,225వ ర్యాంక్, అనుష్క 14,024వ ర్యాంక్ సాధించినట్లు కరస్పాండెంట్ పసుపులేటి అరుణోదర్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ఆదివారం అభినందించారు.

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

వలేటివారిపాలెం: మండలంలోని చుండి, కాకర్లపాలెం గ్రామాల్లో ఆదివారం వలేటివారిపాలెం పీహెచ్‌సీ డాక్టర్ మణిదీపిక 22 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యురాలు మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలని కోరారు. ఆమె వెంట ఏఎన్‌ఎం అనిత, ఆశా వర్కర్లు ఉన్నారు.

21, 22 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

సీఎస్‌పురం(పామూరు): దర్శిలో ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి సయ్యద్‌మౌలాలి అన్నారు. మండలంలోని నల్లమడుగుల ఎస్టీ కాలనీలో సీపీఐ మండల కార్యదర్శి వై.పెదమస్తాన్, సహాయ కార్యదర్శి ఎస్‌కేవై పెదమౌలాలిల ఆధ్వర్యంలో శాఖా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 23 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొన్నలూరు మండల కమిటీని పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పొన్నలూరు మండల మండల ఉపాధ్యక్షులుగా కాటా మల్లికార్జున, గడ్డం మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శులుగా బాలు ఈశ్వర్‌రెడ్డి, ఎం హరిబాబు, చల్లగొలుసు తిరుపతి స్వామి, వరికూటి రమేష్‌రెడ్డి, కార్యదర్శులుగా నేలపాటి రూబెన్, షేక్ రసూల్, సిరిగిరి సుధాకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నవులూరి ప్రసాద్, తానికొండ సుధాకర్‌రావు, దుద్దుకుంట శ్రీరాములు, యెంపరాల మాధవరావు, పుల్లల చెరువు రవి, ధనలూరి మాల్యాద్రి, వెనపూస మాల్యాద్రి, మూతంగి మహేష్, లెక్కల కృష్ణారెడ్డి, కట్టా కరుణాకర్‌రావు, పిల్లి శ్రీనివాసరెడ్డి, తువ్వా అశోక్, కొల్లూరు సూర్యనారాయణ, డి.మధుసూదన్‌రెడ్డి, నారపరెడ్డి మహేష్‌రెడ్డి, జడ్డు కృష్ణారెడ్డి, మూలె కృష్ణారెడ్డి, పుల్లెబోయిన వెంకట రమణయ్య, చిర్రా కృష్ణారెడ్డి, గొర్రెపాటి మహేష్, కాటూరి రంగారావు, గొల్లపూడి వెంకట రమణయ్య, సిహెచ్ రమేష్, యర్రా గోపాల్‌లు నియమితులయ్యారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మాలమహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య

టంగుటూరు: ఎస్సీ, ఎస్టీ కేసులో విచారణకు వచ్చిన వారిని రాజీకి రావాలంటూ బెదిరించి పొందూరుకు చెందిన కట్టా ఆదినారాయణ కుటుంబంపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి బాధితులతో కలిసి టంగుటూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొందూరులో 2022లో మొండ్రు హనుమంతరావు అనే దళితునికి, ఆవుల నరసింహారావు అనే ఇతర కులానికి చెందిన వ్యక్తికి పొలం విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో గుమ్మలంపాటి కోటి, నాగులు, కట్టా ఆదినారాయణ తదితరులపై తెలుగుదేశం పార్టీకి చెందిన పాపినేని వేణు, పమిడి నాగేశ్వరరావు తదితరులు నరసింహారావుకు సపోర్టుగా వచ్చి దళితులపై దాడి చేశారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదై కోర్టులో వాయిదా జరుగుతున్నాయి. ఈ కేసులో రాజీకి రావాలంటూ నిందితులైన పాపినేని వేణు, నాగేశ్వరరావు, వేజెండ్ల ప్రసాదులు కట్టా ఆదినారాయణ తదితరులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో శనివారం పొందూరుకు పోయే దారిలోని చిన్న యల్లమంద కుంట వద్ద కట్టా ఆదినారాయణ, అతని భార్య, కొడుకు, కోడలపై దాడికి పాల్పడ్డారు. కర్రలు, రాళ్లతో మోటార్ సైకిల్ ధ్వంసం చేసి తాళాలు తీసుకుపోయారు. కేసు రాజీకి రాకుంటే చంపేస్తామని బెదిరించి కులం పేరుతో దూషించారు. తిరిగి పాపినేని వేణు మాలపల్లెకు వచ్చి కేసు రాజీకి రాకుండే తగలబెడతామంటూ వీరంగం సృష్టించాడు. దీంతో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య ఎస్పైని కలిసి నిందితుల బెయిల్ రద్దు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న దద్దాల నారాయణ

కనిగిరిరూరల్: దద్దాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పెద్ద కుమార్తె దద్దాల సాయి ప్రణవి పుట్టిన రోజు పురస్కరించుకుని దివ్యాంగులకు దద్దాల నారాయణ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దద్దాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవాహిత కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, యక్కంటి శ్రీను, ఆర్ మాణిక్యరావు, ఎస్‌కే జిలానీబాషా, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, ఎం నాగమణి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, పులి శ్రీను, ఎస్‌కే ఖాశింసా తదితరులు పాల్గొన్నారు.

పామూరు: దాతలు సమకూర్చిన ట్రై సైకిళ్లను దివ్యాంగులు వినియోగించుకోవాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ తన సొంతనిధులతో దద్దాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చి ఇచ్చిన ట్రైసైకిళ్లను ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంపిణీచేశారు. కల్లూరి రామిరెడ్డి, షేక్.చాంద్ బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జె.గోవిందయ్య, శ్రీరామ శ్రీనివాసులు, తుమ్మా పిచ్చిరెడ్డి, చప్పిడి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన, అభిషేకం



అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన, అభిషేకం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. నారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు.

అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ మహా నైవేద్యంతో ఆలయంచుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. ముందుగా స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం ఘనంగా నిర్వహించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



కలశ బిందెలతో మహిళలు..

- 251 కలశ బిందెలతో విశేష అభిషేకం

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలోని సాయిబాబా ఆలయ రెండో వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు గ్రామంలోని మహిళలు ఉదయం 6 గంటలకు 251 కలశ బిందెలతో మంచినీటిని శివాలయం దగ్గర నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి విశేష అభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాబాకు లక్ష పూలతో విశేష అభిషేకం కనులపండువగా నిర్వహించారు. అనంతరం హోమాలు, మహా హారతి కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి స్వామి వారి గ్రామోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు యోగా ర్యాలీ

గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరులో సోమవారం నిర్వహిస్తున్న యోగా అవగాహన ర్యాలీని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వై.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 8 గంటలకు ర్యాలీ ప్రారంభమై ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగుతుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజలు పాల్గొనాలని ఎంపీడీఓ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

తైక్వాండో విజేతలకు బెల్టుల ప్రదానం



తైక్వాండాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి బెల్టు అందజేస్తున్న మారుతీ ప్రసాద్

కొండపి: మండలంలోని కట్టావారిపాలెం హ్యాపీ కిడ్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మన ఊరి వికాసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తైక్వాండో పరీక్షలు నిర్వహించారు. ఆల్ ఇండియా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు, 8వ డిగ్రీ బ్లాక్ బెల్ట్ ఉన్నం మారుతి ప్రసాదు చీఫ్ ఎగ్జామినర్‌గా హాజరై విజేతలైన 7 మందికి బ్లూ, 13 మందికి గ్రీన్, 18 మందికి ఎల్లో బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒంగోలు దేవి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ కంకణాల కృష్ణ మోహన్ మాట్లాడుతూ తైక్వాండో విద్య నేర్చుకోవడం వలన యువతకు ఆత్మ విశ్వాసంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ధర్మవరపు అజయ్, మన ఊరి ఆరోగ్య వికాసం అధ్యక్ష, కార్యదర్శులు కట్టా రవికుమార్, వీరమోసు మస్తానరావు, ఆరోగ్య విస్తరణాధికారి జి.నాగేశ్వరరావు, హ్యాపీకిడ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి, తైక్వాండో టీచర్స్ శ్రీనివాసరావు, శరవణ, జి.శ్రీను, గురుచరణ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఉలవపాడు:

2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ అపూర్వ వేడుకకు ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు హాజరై ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో వారికి ఉన్న అనుబంధం, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో వారికి ఉపాధ్యాయులుగా పనిచేసిన శివశంకర్‌రెడ్డి, విజయలక్ష్మి, రాఘవరావును సన్మానించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణలో ఆర్డీఓ, చైర్మన్

కనిగిరిరూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తోందని ఆర్డీఓ బి. కేశవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక యోగా కేంద్రంలో యోగా శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ యోగా వలన మానసిక ఉల్లాసం, దృఢత్వం పెరుగుతుందన్నారు. శ్వాస శక్తి పెరుగుతుందన్నారు. యోగా గురువు కాపుగంటి నాగేశ్వరరావు యోగా శిక్షణలు ఇచ్చి, అవగాహన కల్పించారు. న్యాయవాది చప్పరపు వాసు, కమిషనర్ డానియేల్ జోసఫ్, ఎంఈఓ యువీ నారాయణరెడ్డి, రమణయ్య, నరాల శ్రీనివాసులరెడ్డి, గాయం ప్రసాద్ రెడ్డి, పాపసాని కృష్ణారెడ్డి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, పచ్చవ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.